క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

సి.బెళగల్: ఇసుకను అక్రమంగా రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మా రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పోలీస్ సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. తుంగభద్ర నదీతీర గ్రామమైన తిమ్మందొడ్డి నుంచి ఇసుకను తరలిస్తున్న నాగులదిన్నె, ఎమ్మిగనూరుకు చెందిన ఉరుకుందు, మాబాషాల ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాపై ప్రజలకు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



ఉపాధ్యాయుల హాజరును పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ఆదామ్ బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉన్నతికి తోడ్పడాలని ఎంఈఓ-2 ఆదామ్‌బాషా అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా పాఠ్యాంశాల బోధన, తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే విద్యార్థుల భోజన ఏర్పాట్లపై ఉపాధ్యాయులు, భోజన నిర్వాహకులను ఆరా తీశారు. స్కూల్ హెచ్ఎం ఖద్దం రాజు, ఉపాధ్యాయుడు పాపారాయుడు ఉన్నారు.

కోనా వెంకన్నకు ప్రత్యేక పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. భూదేవి, అలిమేలి మంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ చేశారు. నైవేద్య సమర్పణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. స్థానికులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో చింతల మునిస్వామి ఆరాధనోత్సవం



స్వాముల వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఓర్వకల్లు : మండల పరిధిలోని నన్నూరు శివారులోని జాతీయ రహదారి పక్కన వెలసిన చింతలముని, నల్లారెడ్డి, మద్దిలేటయ్య స్వాముల ఆరాధనోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వాముల వారికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, గ్రామ దేవతల పూజలు, మధ్యాహ్నం మహానైవేద్యం, సాయంత్రం బిందె సేవ, ఆకుపూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారులు కృష్ణ, చంద్రకళ తెలిపారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కురువ నాగమద్దయ్య, కురువ లక్ష్మిదేవి, పెద్ద వెంకటస్వామి, మునిస్వామి, రామకృష్ణ, నాగరాజు, బెంగుళూరు మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదం శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వేదం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. వేదం నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 99636 27670 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సోషల్ మీడియా ఔత్సాహికుల సమావేశం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సోషల్ మీడియా ఔత్సాహికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంత సోషల్ మీడియా ప్రముఖ్, ప్రాంత ప్రచార టోలీ సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక లేక.. నిర్మాణం సాగక

- మండలంలో తీవ్ర ఇసుక కొరత
- మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలు
- పనుల్లేక కార్మికుల అవస్థలు
- పడిపోయిన ఇనుము, సిమెంట్ వ్యాపారాలు
- బ్లాక్‌లో టన్ను ఇసుక రూ. 1500పైనే



పాణ్యం జగనన్న కాలనీలో ఇసుక లేక నిలిచిపోయిన పనులు



గ్రామంలో లెంటల్ లెవెల్‌లో నిలిచిన ఇంటి నిర్మాణం

పాణ్యం : ఇసుక అందుబాటులో లేక నిర్మాణం రంగం నిలచిపోయింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇసుక కొరత కారణంగా అటు ఇనుము, సిమెంట్, ఇతర గృహనిర్మాణ సామగ్రి దుకాణాలు అన్ని ఢీలాపడ్డాయి. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి .. నేడు గతంలో కంటే అధిక ధరకు సరఫరా చేస్తున్నారు. అయినా ఎక్కడా ఇసుక దొరక్కపోవడంతో కార్మికులు, గృహ నిర్మాణాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక పాయింట్, బుకింగ్ తదితర వాటిపై పూర్తి స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సామాన్యుడికి అందుబాటులో..

గత ప్రభుత్వంలో మండల పరిధిలో ఇసుక టన్ను రూ.800 అన్‌లోడ్ చేసేవారు. అంతేకాక పాణ్యం మార్కెట్‌యార్డులో డంప్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటే ఇసుక లోడ్ చేసి పంపేవారు. దీంతో సామాన్యుడికి ఇసుక సులభంగా, తక్కువ ధరకు లభించేంది. ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుడికి ఇసుక అందని ద్రాక్షలా మారింది. మండలంలో ఇసుక అందుబాటులో లేకపోవడం, ఎక్కడి నుంచి తెచ్చుకోవాలో తెలియక పోవడంతో ఇంటి నిర్మాణాలను మధ్యలోనే వదిలేస్తున్నారు.

బ్లాక్‌లో టన్ను రూ.1500పైమాటే

కూటమి ప్రభుత్వంలో అందరికీ ఉచిత ఇసుకత ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు డబ్బులు కట్టమని చెబుతున్నారు. డబ్బు కట్టి బుక్ చేసుకుందామన్నా ఎక్కడా ఇసుక దొరకడం లేదు. గ్రామీణ ప్రాంతాలకే కాదు, కనీసం మండల కేంద్రానికి కూడా ఇసుక అందుబాటులో లేదు. బుకింగ్ చేసుకున్న వారికి కూడా ఇసుక దొరకడం లేదు. ఎప్పుడైనా అడపాదడపా వచ్చే ఇసుకను కొందామంటే బ్లాక్‌లో ధర ఆకాశాన్నంటుతోంది. ఇటీవల రెండు మూడు లారీల్లో అతి గోప్యంగా వస్తే టన్ను రూ.1500పైగా ధర పలికింది.

ఎక్కడి పనులు అక్కడే

గత ప్రభుత్వం హయాంలో మొదలుపెట్టిన ఇంటి నిర్మాణాలకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత నిచ్చింది. ఇనుము, సిమెంట్, కడ్డీలు, తులుపులు, ఇతర ఇంటి సామగ్రి అందించింది. అయితే ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే నిలచిపోయాయి.

ఇలా వంద కొద్ది నిర్మాణాలు మొండిగోడలను తలపిస్తున్నాయి. గృహ ఎదురుచూస్తున్నా.. కనీసం చూద్దానికి కూడా ఇసుక లేకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇసుక ఇంత బంగారమవుతుందని కల్లో ఊహించలేదంటున్నారు.

ఇసుక దొరకడం లేదు

నాకు పాణ్యం జగనన్న కాలనీలో ఇళ్ల వచ్చింది. లెంటల్ వరకు పనులు అయ్యాయి. నాలుగు నెలల నుంచి ఇసుక దొరడకం లేదు. అంతేకాక ఇసుక ఎక్కడైనా కొందామంటే ట్రాక్టర్ రూ.7వేల పైనే చెబుతున్నారు. అంత కొని ఇళ్ల కట్టించలేక నిర్మాణం ఆపేశానాను. గతంలో పాణ్యంలోనే ఇసుక ఉండేది. బుకింగ్ చేసుకొని ఇసుక తీసుకునేవారం. ఏపనీ జరగడం లేదు. – ఖాజా ఉసేన్ పాణ్యం

పనుల్లేవు

గత నాలుగు నెలలుగా ఇసుక లేని కారణంగా మాకు పనుల్లేవు. ఇంటి యజమానులు ఇసుక వచ్చేంత వరకు పనులు వద్దని చెబుతున్నారు. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇతర పనులకు వెళ్దామంటే ఆ పనులు మాకు రావు. వచ్చిన పని చేస్తామంటే ఇసుక సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వం ఇకనైనా చొరవ తీసుకొని ఇసుకను సరఫరా చేయాలి. – సునీల్, తాపీ మేస్త్రీ

ప్రత్యామ్నాయంగా డస్ట్ వాడకం

ప్రస్తుతం ఇసుక దొరకడం లేదు. దీంతో చాలా మంది తమ నిర్మానాలు ఆపుకోలేక 5 యూనిట్ల డస్ట్ రూ. 15వేలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసి పనులు చేయిస్తున్నారు. ఇలా ఆర్థికంగా ఉన్న వారు కంకర ఫ్యాక్టరీల నుంచి వచ్చే డస్ట్‌ను ఉపయోగిస్తున్నారు. లేని వారు ఇళ్ల నిర్మాణాలను నిలిపివేస్తున్నారు. ఇళ్లతోపాటు ఇతర నిర్మాణాలు కూడా ఎక్కడికక్కడ ఆపేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని పులకుర్తి, వర్కూరు గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఓర్వకల్లు తహసీల్దార్ బదిలీ

ఓర్వకల్లు : మండల తహసీల్దార్ తహసీల్దార్ వెంకటరమణను బదిలీ చేస్తూ జిల్లా ఉన్నత అధికారులు ఉత్తర్యులు జారీ చేశారు. కేవలం మూడు నెలలు మాత్రమే ఇక్కడ పని చేసిన వెంకటరమణను నంద్యాల జిల్లా, గడివేముల మండలానికి బదిలీ చేశారు.

ఓర్వకల్లు తహసీల్దార్‌గా విద్యాసాగర్

గడివేముల: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న విద్యాసాగర్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలానికి బదిలీయ్యారు. ఈమేరకు శనివారం జిల్లా ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాకముందే తహసీల్దార్‌ను బదిలీ చేయడంపై అంతర్యం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎస్‌జీఎఫ్ నూతన కార్యాలయం ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో ఫర్నీచర్‌ను క్రీడా దాత శ్రీధర్ రెడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు అంటే తనకు ఆసక్తి అని, అందుకే క్రీడాకారులకు తన వంతు సాయం చేసి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొన్నారు.

ఏపీఓగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు తీసుకుంటున్న రామన్న

సి.బెళగల్: మండల ఉపాధిహామీ ఏపీఓగా రామన్న శనివారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన లక్ష్మన్న వెల్దుర్తి మండలానికి బదిలీ అయ్యారు.

పకడ్బందీగా ఉపాధి పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఏపీఓ రామన్న అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. గ్రామ సభల్లో తీర్మానించిన పనులను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామి ఈసీ పృధ్విరాజ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దుదాం



పాణ్యం చెంచుకాలనీలో మానవహారంగా ఏర్పడిన అధికారులు, చెంచు మహిళలు



సి.బెళగల్: పార్కులో పరిశుభ్రత పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రాముడు



కల్లూరు: మొక్క నాటుతున్న దృశ్యం

పాణ్యం : ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని నంద్యాల జిల్లా డీపీఓ మంజులవాణి సూచించారు. శనివారం పాణ్యంలోని చెంచుకాలనీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మన గ్రామం-మన ఆరోగ్యం పేరుతో అందరూ ముందుకెళ్లాలన్నారు. అలాగే తమ వంతుగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అలాగే తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బందికి ఇచ్చి పారిశుద్ధ్యానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సి.బెళగల్: గ్రామాల్లో ప్రజల కోసం ఏర్పాటు చేసిన సామాజిక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ రాముడు అన్నారు. శనివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా సి.బెళగల్ పంచాయతీ పార్కులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకర జీవితం సాధ్యమని తెలిపారు. పార్కు పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్, వెలుగు ఏపీఎం వెంకటస్వామి ఉన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

కల్లూరు : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకుందామని కాంకార్ విద్యాసంస్థల చైర్మన్ కె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శనివారం మయూరి గ్రీన్ హిల్స్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కాంకార్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు మొక్కలు నాటారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- అత్యుత్సాహం ప్రదర్శించిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు



ఎంపీపీ వెంకటేశ్వరమ్మతో వాగ్వివాదం చేస్తున్న టీడీపీ ఎంపీటీసీ సభ్యులు

కర్నూలు (రూరల్): నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో మహిళా ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మపై నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలోనే టీడీపీ సభ్యులు దురుసుగా ప్రవర్తించారు. ఎమ్మెల్యే కనీసం వారిని వారించకుండా మిన్నకుండిపోయారు. మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మాణాలు చేసుకునేందుకు మండల పరిషత్ అభివృద్ధి నిధులు రూ.2 కోట్లను ఒక ఎంపీటీసీ సభ్యునికి రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తామని సమావేశంలో ఎంపీపీ ప్రకటించగానే టీడీపీ ఎంపీటీసీ సభ్యులు రచ్చరచ్చ చేశారు. మెజార్టీ ఉన్న సభ్యులకే నిధులు కేటాయించాలని వాగ్వాదానికి దిగారు. ఈ గొడవతో మండలంలోని అన్ని శాఖల ప్రత్యేక అధికారులు ఒకింత విస్మయానికి గురయ్యారు. నిధుల కేటాయింపు సమావేశంలో అరుపులు, కేకలు తారాస్థాయికి చేరడంతో గంట లోపే ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ పి. రంజిత్‌బాషా, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): చైల్డ్‌హుడ్ క్యాన్సర్(చిన్నతనంలో వచ్చే క్యాన్సర్)ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నివారణ సాధ్యమని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా చెప్పారు. శనివారం విశ్వభారతి వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో చైల్డ్‌హుడ్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు మారథాన్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ అనేది పెద్ద వారిలోనే గాక చిన్నపిల్లల్లో వచ్చే అవకాశం ఉంటుందని, అలాంటి సమయంలో భయాందోళనకు గురిగాకుండా ప్రారంభ దశలో వాటిని గుర్తించి అందుకు తగిన చికిత్సను తీసుకోవడం ద్వారా చిన్నారులు త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏ జబ్బు అయినా ఒక వారం రోజులు ఇబ్బంది పెడుతుంటే అందుకు తగిన చికిత్స తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వభారతి ఆసుపత్రి సీఈవో డాక్టర్ కాంతారెడ్డి, డాక్టర్ నిహారిక, డాక్టర్ కాశీభారతి, వైద్య సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఓర్వకల్లు: ప్రతిభ చూపిన క్రీడాకారులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కర్నూలు (రూరల్): కర్నూలు నగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో ఉల్చాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం అండర్ 14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. యోగాలో లిఖిత్‌సాయి (6వ తరగతి), అజీజ్ (6వ తరగతి), మనీషా (8వ తరగతి) ద్వితీయ శ్రేణిలో నిలిచారు. అలాగే హైజంప్‌లో 8వ తరగతి విద్యార్థిని అనిత వెండి పతకం సాధించింది. ఖోఖోలో మండల స్థాయి జట్టుకు 7వ తరగతి విద్యార్థిని వైశాలి ఎంపికైంది. అలాగే 100 మీటర్ల పరుగు పందెంలో 10వ తరగతి చదివే మద్దిలేటి ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో మొదటి స్థానం సాధించాడు. 400 మీటర్ల పరుగు పందెంలో 10వ తరగతి విద్యార్థి చేతన్ ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో రాజ్‌కుమార్ (9వ తరగతి) ద్వితీయ స్థానం సాధించారు. 300 మీటర్ల పరుగుపందెంలో చంద్రశేఖర్ తృతీయ స్థానం, అలాగే జావలిన్ త్రోలో మొదటి స్థానం సాధించాడు. అండర్-17 కబడ్డీలో పాఠశాల బాలుర జట్టు విజేతగా నిలిచింది. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని సర్తాజ్ ఉన్నీసా బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, మహ్మద్ సిరాజ్ అభినందించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఓర్వకల్లు : విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ప్రిన్సిపాల్ క్లమేట్ సత్యబాబు అన్నారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన తమ పాఠశాలకు చెందిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించిన అండర్-17 బాలికల విభాగంలో తమ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం, ఓర్వకల్లు పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించడం గర్వించదగ్గ విషయన్నారు. అలాగే అండర్-14 విభాగంలో ఓర్వకల్లు జెడ్పీ హై స్కూల్ విద్యార్థినులు మొదటి స్థానం, తమ పాఠశాల విద్యార్థినులు ద్వితీయ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల మండల కన్వీనర్ హరిప్రసాద్‌గౌడు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



గడివేముల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్ఎం విక్టర్ ఇమ్మానియల్

క్రీడలతో ఒత్తిడి దూరం

గడివేముల: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడిని తగ్గించుకొని సృజనాత్మక శక్తి పెంపొందించుకోవచ్చని హెచ్ఎం విక్టర్ ఇమ్మానియల్ తెలిపారు. స్థానిక గడివేముల జెడ్పీ స్కూల్‌లో మండలస్థాయి క్రీడలను శనివారం ప్రారంభిచారు. అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 230 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పీఈటీలు భుజంగరావు, కవిత పాల్గొన్నారు.

'ఆందోళనతోనే విద్యార్థినులకు అస్వస్థత'

కర్నూలు(అర్బన్): ఆదోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో సహచర విద్యార్థినులు ఇరువురు అస్వస్థతకు గురికావడంతో మరో ఐదుగురు సహచర విద్యార్థినులు ఆందోళనతో స్వల్ప అస్వస్థతకు లోనయ్యారని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ అన్నారు. రెండు రోజుల పాటు ఆదోనిలో పూర్తిస్థాయి విచా రణ చేపట్టామని శనివారం సాయంత్రం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యులు కూడా ఐదుగురు విద్యార్థినులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, కేవలం ఆందోళనకు గురికావడం వల్లే ఇలా జరిగిందని చెప్పారన్నారు. 24 గంటల పర్యవేక్షణ అనంతరం శనివారం డిశ్చార్జి చేశారన్నారు. హాస్టల్‌లో కలుషిత ఆహారం తినడం వల్లే ఇలా జరిగిందని ఆరోపణలు రావడం పూర్తిగా అవాస్తవమన్నారు.

నగరపాలక అదనపు కమిషనర్‌గా క్రిష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక అదనపు కమిషనర్‌గా ఆర్.జీ.వి. క్రిష్ణను ప్రభుత్వం నియమించింది. గ్రేడ్-1 కమిషనర్‌గా పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేసి, ఇక్కడ పనిచేస్తున్న అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్‌ను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌గౌడ్‌ను డోన్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. గ్రేడ్-2 స్థాయిలో కమిషనర్‌గా పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎం.క్రిష్ణను ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. శనివారం రాత్రి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నియమాక ఉత్తర్వులు జారీ చేశారు.

అదనపు ఫ్లోర్లపై టౌన్‌ప్లానింగ్ ఆరా

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు లేకుండా అదనంగా నిర్మించిన నిర్మాణాలపై నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ రవీంద్రబాబు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు రాఘవేంద్ర నగర్‌లో పర్యటించారు. నరసింగరావు పేటలో అనుమతి లేకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి తొలగించారు. అలాగే నరసింహా రెడ్డి నగర్‌లో కూడా నిర్మాణ పనులను నిలిపి వేశారు.

జపనీస్ కంపెనీల ప్రతినిధులతో ఆర్జీఎం డీన్ భేటీ



జపనీస్ కంపెనీ ప్రతినిధులతో ఆర్‌జీఎం డీన్ డాక్టర్ అశోక్‌కుమార్

పాణ్యం: జపనీస్ కంపెనీల ఆర్‌జీఎం డైరెక్టర్ డాక్టర్ డీవీ అశోక్ కుమార్ శనివారం భేటీ అయ్యారు. బెంగుళూరులో కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన దక్షిణ రాష్ట్రాల సదస్సులో ఆయన పాల్గొన్నట్లు ఆర్‌జీఎం ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన బెంగళూరులో కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జపాన్‌కు చెందిన పలు కంపెనీ సీఈఓ రిక్రూట్మెంట్ మేనేజర్లతో సదస్సు నిర్వహించిందన్నారు. ఈ సదస్సులో జపాన్ కంపెనీలలో ఆర్జీఎం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరామన్నారు. దీనిపై జపాన్ కంపెనీ ప్రతినిధులు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిపారు. సదస్సులో జపాన్‌కు చెందిన మెకిక్యూరీ, హోండా మోటార్స్, బిగ్ ఫోర్, ఫోర్త్ వ్యాలీ, కన్సర్జ్ వంటి ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. అలాగే జపనీస్ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎకనామిక్స్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

నేడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల రాక

కర్నూలు(అర్బన్): ఈ నెల 22వ తేదీన జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (న్యూఢిల్లీ) సభ్యులు జటోతు హుసేన్ కర్నూలుకు రానున్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు వెనుకనున్న వెంకట చలపతి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లు ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి వారి అభ్యర్థనలను స్వీకరించనున్నారు. కార్యక్రమానికి జిల్లాలోని గిరిజన సంఘాలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొనాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె. రంగలక్ష్మీదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

కర్నూలు కల్చరల్: బీక్యాంప్ విజ్ఞాన మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ×మహాలయ పక్షం విశిష్టత, పెద్దల అమావాస్య మహత్యం౯ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని విజ్ఞాన మందిరం అధ్యక్షుడు కురాడి కంద్రశేఖర కల్కూర తెలిపారు. పేజావర మఠాధీశులు విశ్వ ప్రసన్న తీర్థ స్వామీజీ శిష్యుడు రవి తేజ ఉపన్యసిస్తాడని పేర్కొన్నారు.